సాక్షి సూర్యాపేట

శనివారం । 29 । జూన్ । 2024



ఉన్నతంగా మహిళా కళాశాల
నల్లగొండలోని మహిళా డిగ్రీ కళాశాలలో చేరేందుకు ఉమ్మడి జిల్లాల విద్యార్థినులు ఆసక్తి చూపుతున్నారు. - 8లో



మమ్మల్ని విడిచి వెళ్లొద్దు..
మమ్మల్ని విడిచి వెళ్లొద్దు సార్ అంటూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడిని విద్యార్థులు వేడుకున్నారు. - 8లో

గరిష్ఠం / కనిష్ఠం
30° / 26°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి



కోదాడలోని విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

కోదాడరూరల్‌: వానాకాలం సీజన్‌లో సాగు చేసేందుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని లక్ష్మీగణపతి, రాజ్యలక్ష్మి, చంద్రకళ సీడ్స్‌ దుకాణాలతోపాటు తమ్మరలోని సహకార సంఘంలో గల విత్తనాలను ఆయన పరిశీలించారు. డీలర్లు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. విత్తనాలు, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా షాపుల్లోని స్టాక్‌ను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అదేవిధంగా తమ్మరలో జీలుగ సాగును పరిశీలించారు. ఆయన వెంట ఏఓ పాలెం రజిని, ఏఈఓ అఫ్రిన్‌, సీఈఓ వెంకటేశ్వర్లు ఉన్నారు.

టెన్త్‌ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల

సూర్యాపేటటౌన్‌: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు శుక్రవారం విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. జిల్లాలో బాలురు 259 మంది పరీక్ష రాయగా 220 మంది ఉత్తీర్ణులు, బాలికలు 145 మంది రాయగా 130 మంది ఉత్తీర్ణులైనట్లు డీఈఓ అశోక్‌ తెలిపారు. మొత్తం 404 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 350 మంది విద్యార్థులు పాస్‌ అయ్యారని, 86.63 ఉత్తీర్ణత శాతం నమోదైనట్లు పేర్కొన్నారు. రీ కౌంటింగ్‌ కోసం జూలై 8వ తేదీ వరకు విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.500 చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రీ వెరిఫికెషన్‌ కోసం ఆన్సర్‌ బుక్‌ కావాల్సిన విద్యార్థులు రూ.వెయ్యి రుసుం చెల్లించి పొందవచ్చని తెలిపారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



పుస్తకాలు అందజేస్తున్న సవీందర్‌కుమార్‌

సూర్యాపేట: ప్రతి విద్యార్థి అధ్యాపకులు చెప్పిన అంశాలను నిరంతరం అధ్యయనం చేస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా కోర్టు అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ నాతి సవీందర్‌కుమార్‌ అన్నారు. సంఘమిత్ర ఎడ్యుకేషనల్‌ చారిటబుల్‌ సొసైటీ అధ్యక్షుడు తల్లమళ్ల హస్సేన్‌ ఆధ్వర్యంలో శుక్రవారం సూర్యాపేటలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో జ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాతి సవీందర్‌కుమార్‌ మాట్లాడుతూ.. స్టడీ సర్కిల్స్‌ను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని కోరారు. అనంతరం సంఘమిత్ర ఎడ్యుకేషనల్‌ చారిటబుల్‌ సొసైటీ తరఫున స్టడీ సర్కిల్‌ లైబ్రరీకి పుస్తకాలు, విద్యార్థులకు నోట్‌ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్‌ డైరెక్టర్‌ సీహెచ్‌ రాములు, ప్రభుత్వ న్యాయవాది దప్పు మల్లయ్య, లీగల్‌ సర్వీసెస్‌ మండల కమిటీ మెంబర్‌ ఏడిండ్ల అశోక్‌, న్యాయవాదుల కో ఆపరేటివ్‌ సొసైటీ ప్రధాన కార్యదర్శి కోక రంజిత్‌కుమార్‌, ప్రైవేట్‌ కాలేజ్‌ లెక్చరర్‌ బోయిల్ల అఖిల్‌ పాల్గొన్నారు.

శతాధిక కవి సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

మునగాల: జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీకళావేదికలో ఈనెల 30న నిర్వహించనున్న శతాధిక కవి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని శ్రీశ్రీ కళావేదిక సూర్యాపేట జిల్లా శాఖ అధ్యక్షుడు పోతుగంటి వీరాచారి కోరారు. శుక్రవారం మునగాల మండలంలోని నర్సింహపురంలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కత్తిమండ ప్రతాప్‌ సారథ్యంలో జాతీయ కన్వీనర్‌ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం పర్యవేక్షణలో జరిగే సమ్మేళనానికి అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల కవితా శ్రీనివాస్‌, సామాజిక ఉద్యమకారుడు వేమూరి సత్యనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే సహకారం!

డీసీసీబీ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తిన 15 మంది డైరెక్టర్లు
- పదవి కోల్పోయిన బీఆర్‌ఎస్‌ నేత మహేందర్‌ రెడ్డి
- జూలై 1వ తేదీన చైర్మన్‌ ఎన్నిక
- కాంగ్రెస్‌ వశం కానున్న డీసీసీబీ
- నూతన చైర్మన్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యే అవకాశం



అవిశ్వాసం నెగ్గిన అనంతరం విజయ సంకేతం చూపుతున్న డీసీసీబీ డైరెక్టర్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పీఠం కాంగ్రెస్‌ పార్టీ వశం కానుంది. ఇప్పటివరకు చైర్మన్‌గా వ్యవహరించిన బీఆర్‌ఎస్‌ నాయకుడు గొంగిడి మహేందర్‌రెడ్డిపై డైరెక్టర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శుక్రవారం డీసీసీబీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి 15 మంది హాజరై అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులెత్తడంతో మహేందర్‌రెడ్డి చైర్మన్‌ పదవిని కోల్పోయారు. దీంతో వైస్‌ చైర్మన్‌గా ఉన్న దయాకర్‌రెడ్డిని ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించారు. మహేందర్‌రెడ్డితోపాటు ఆయన వెంట ఉన్న ముగ్గురు డైరెక్టర్లు సమావేశానికి హాజరుకాలేదు. జూలై 1వ తేదీన చైర్మన్‌ పదవికి ఎన్నిక నిర్వహిస్తామని జిల్లా సహకార అధికారి ప్రకటించారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌ రెడ్డి అనుచరుడు, మునుగోడు పీఏసీఎస్‌ చైర్మన్‌, డీసీసీబీ డైరెక్టర్‌ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కొత్త చైర్మన్‌గా ఎన్నిక కానున్నట్లు తెలుస్తోంది.

మ్యాజిక్‌ ఫిగర్‌ దాటి..

డీసీసీబీ అవిశ్వాస సమావేశానికి మ్యాజిక్‌ ఫిగర్‌ దాటి డైరెక్టర్లు హాజరు కావడంతో అవిశ్వాసం నెగ్గింది. కుంభం శ్రీనివాస్‌రెడ్డి పక్కా వ్యూహంతో వ్యవహరించి తమవైపు ఉన్న ఒక్క డైరెక్టర్‌ కూడా వెనక్కి వెళ్లకుండా కాపాడుకోవడంతో సక్సెస్‌ అయ్యారు. ఈ నెల 10వ తేదీన అవిశ్వాసం నోటీసు ఇచ్చిన నాటి నుంచి 17 రోజుల పాటు వారు తనవెంటే ఉండేలా చూడగలిగారు. డీసీసీబీలోని మొత్తం 19 మంది డైరెక్టర్లలో 10 మంది కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నా సహకార చట్టం నిబంధనల ప్రకారం



విలేకరులతో మాట్లాడుతున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి, పక్కన ఇన్‌చార్జి చైర్మన్‌, డైరెక్టర్లు

అవిశ్వాసం నెగ్గాలంటే కనీసంగా 14 మంది (మూడింట రెండో వంతు) ఉండాల్సిందే. అందుకు అనుగుణంగానే కుంభం శ్రీనివాస్‌రెడ్డి 14 మంది మద్దతు కూడగట్టగలిగారు.

మహేందర్‌రెడ్డికి నిరాశే..

డీసీసీబీలో మొత్తం డైరెక్టర్లు 19 మందిలో మొదట్లో కాంగ్రెస్‌ పార్టీకి ఒక్క డైరెక్టరే ఉన్నారు. మిగతా 18 మంది బీఆర్‌ఎస్‌కు చెందిన వారే. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎనిమిది మంది బీఆర్‌ఎస్‌ నుంచి కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటయ్యాక వైస్‌ చైర్మన్‌గా ఉన్న ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి సీఎం సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరడంతో కాంగ్రెస్‌ బలం 10కి చేరింది. బీఆర్‌ఎస్‌కు చెందిన మరో ఐదుగురు డైరెక్టర్లు కాంగ్రెస్‌ వైపే మొగ్గుచూపారు. చైర్మన్‌ మహేందర్‌రెడ్డితో పాటు ప్రవీణ్‌రెడ్డి, రంగాచారి, అప్పిరెడ్డి మాత్రమే బీఆర్‌ఎస్‌ వైపు ఉన్నారు. ఆయన వెంట కేవలం ముగ్గురే ఉన్నా.. అవిశ్వాసం వీగిపోయేందుకు చివరి వరకు ప్రయత్నం చేశారు. అవిశ్వాసం వీగిపోవాలంటే 14 మంది సమావేశానికి హాజరు కాకుండా ఉండాలి. అందుకే కాంగ్రెస్‌ వైపునకు వెళ్లిన ఐదుగురిలో ఇద్దరిని వెనక్కి తీసుకొచ్చేందుకు మహేందర్‌రెడ్డి అన్ని ప్రయత్నాలు చేశారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి వెనక్కి రావాలంటూ వారితో చర్చలు జరిపినా ఫలితం దక్కలేదు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా..

- డీసీసీబీ డైరెక్టర్‌ కుంభం శ్రీనివాస్‌ రెడ్డి

డీసీసీబీని పార్టీలకతీతంగా రైతు సంక్షేమ ధ్యేయంగా ముందుకు తీసుకుపోతామని డీసీసీబీ డైరెక్టర్‌ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అవిశ్వాస తీర్మానం నెగ్గిన అనంతరం మీడియాతో మాట్లాడారు. నల్లగొండ డీసీసీబీపై మరోసారి కాంగ్రెస్‌ పార్టీ జెండా ఎగరబోతోందన్నారు. బ్యాంకును అభివృద్ధి చేస్తూ రైతులకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. గత పాలకులు డీసీసీబీకి రాజకీయ రంగు పులిమి ఇష్టానుసారంగా వ్యవహరించారని విమర్శించారు. తాము రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. బ్యాంకు డైరెక్టర్లు, అధికారులు, ఉద్యోగుల సలహాలు సూచనలతో రైతుల సంక్షేమం కోసం పనిచేస్తామన్నారు. రైతుల సంక్షేమం కోసమే అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గించుకున్నామన్నారు. ఇందుకు సహకరించిన మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌ రెడ్డి, మాజీ మంత్రులు కుందూరు జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్‌ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యే, కాంగ్రెస్‌ పార్టీ శ్రేణులు, డైరెక్టర్లకు ధన్యవాదాలు తెలిపారు.

కదలని సాగు పనులు

- జిల్లాలో ఆశించిన స్థాయిలో కురవని వర్షాలు
- మందగించిన వ్యవసాయ పనులు
- ఈ వానాకాలం సీజన్‌లో సాగు అంచనా 6,34,400 ఎకరాలు
- ఇప్పటివరకు 62,650 ఎకరాల్లో పంటల సాగు



పత్తి చేనులో గుంటుక తోలుతున్న రైతు

భానుపురి (సూర్యాపేట): జిల్లాలో వానాకాలం పంటల సాగు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. నైరుతి రుతుపవనాల ప్రభావం జిల్లాపై అంతగా లేకపోవడంతో వర్షాలు సరిగ్గా పడలేదు. జిల్లాలో జూన్‌ 24వ తేదీ నాటికి సరాసరి 83.0 మి.మీగాను ఇప్పటి వరకు 114.4 మి.మీ వర్షపాతం నమోదైంది. కురవాల్సిన దానికన్నా 38 మి.మీ అధికంగా కురిసినా.. వేసవిని తలపించేలా ఎండలు మండుతున్నాయి. దీంతో ఏటా ఈ సమయానికి జోరుగా సాగే వ్యవసాయ పనులు మందగించాయి. జిల్లాలో మెట్ట పంటల సాగు కాస్త ముందుకు పడుతుండగా.. తరి పంటల సాగుకు రైతాంగం అష్టకష్టాలు పడుతోంది.

మందగించిన సాగు

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 6,34,400 ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశముందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో అత్యధికంగా వరి 4.65 లక్షలు ఎకరాలు, పత్తి 1.12 లక్షలు, కంది 7500 ఎకరాలు, మిర్చి 22వేల ఎకరాల్లో సాగు చేస్తారని భావించారు. ఇప్పటివరకు 62,650 ఎకరాల్లో పంటలు సాగైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడం, ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో జిల్లాలో వ్యవసాయ పనులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. రుతుపవనాల రాకకు ముందే కొన్ని మండలాల్లో పత్తి, పెసర, వేరుశనగ విత్తనాలు విత్తుకున్నారు. సమృద్ధిగా వర్షాలు పడితే వరి సాగుకు దుక్కులను దమ్ము చేసే పనిలో రైతాంగం నిమగ్నమయ్యేది. ప్రస్తుతం ఎండాకాలాన్ని తలపిస్తుండడంతో బోరుబావుల నారుమడులు దున్ని దుక్కుల కోసం నీరు పారిస్తే ఎక్కడి నీరు అక్కడే ఇంకిపోయి పనులు ముందుకు సాగడం లేదు.

అనువైన వర్షాలు పడితేనే..

జూన్‌లో 96.1 మి.మీ సాధారణ వర్షపాతం కురవాల్సి ఉంది. ఇప్పటికే సాధారణానికి మించి 38 మి.మీ అధిక వర్షపాతం నమోదైంది. అయితే ఎండల తీవ్రత ఏమాత్రం తగ్గకపోవడంతో కురిసిన వర్షాలు పంటల సాగుకు అనుకూలంగా లేవు. ఇక జిల్లాలోని 23 మండలాలకు ఏడు మండలాల్లో సాధారణ వర్షపాతం, మరో మూడు మండలాలు పెన్‌పహాడ్‌, పాలకీడు, చింతలపాలెం మండలాల్లో లోటు వర్షపాతమే కురిసింది. జిల్లాలో జూన్‌ 25వ తేదీ నాటికే పత్తిసాగు మొదలుపెట్టారు. ఇతర మెట్ట పంటల సాగు చేపట్టినా.. పత్తిని మాత్రం జూలైలో సాగు చేసేందుకు రైతులు ఇష్టపడరు. ఈ నేపథ్యంలో పత్తి సాగు అంచనా 1.12 లక్షలు కాగా.. ఇప్పటివరకు కేవలం 56,474 ఎకరాల్లోనే సాగైనట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. పంటల నమోదు కార్యక్రమం కొనసాగుతున్నా మరో 15వేల నుంచి 20వేల ఎకరాలకు మించి పెరగకపోవచ్చని తెలుస్తోంది. ఇక.. చెరుకు 30 ఎకరాలు, జీలుగ 3811 ఎకరాలు, వరి 378 ఎకరాలు, కంది 639 ఎకరాలు, పెసర 1261 ఎకరాలు, వేరుశనగ 55 ఎకరాలు, మినుములు కేవలం 2 ఎకరాల్లోనే సాగైనట్లు తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు పడితేనే పంటల సాగు ముమ్మరంగా జరుగుతుందని రైతాంగం పేర్కొంటున్నారు.

పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవు



తహసీల్దార్‌ కార్యాలయానికి వచ్చిన రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ తేజస్‌ నందలాల్‌ పవార్‌

- ఆత్మకూర్‌ మండలంలో కలెక్టర్‌ తేజస్‌ నందలాల్‌ పవార్‌ పర్యటన
- అధికారుల తీరుపై ఆగ్రహం

ఆత్మకూర్‌(ఎస్‌)(సూర్యాపేట): ప్రజలకు సేవలందించడంలో మండల స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తమ పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని కలెక్టర్‌ తేజస్‌ నందలాల్‌ పవార్‌ హెచ్చరించారు. శుక్రవారం ఆత్మకూర్‌ మండలంలో ఆయన పర్యటించారు. కోటినాయక్‌తండా, దుబ్బతండాల్లో పల్లెప్రకృతి వనాలు సందర్శించారు. పెంచాల్సిన చెట్లు కాకుండా వేరే చెట్లు పెంచడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండల పరిషత్‌ కార్యాలయం, తహసీల్దార్‌ కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించారు. పాత పహాణీల రూంను తనిఖీ చేసి వాటి భద్రతను అడిగితెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్‌ కోసం వచ్చిన వారిని మీకు ఏ రోజు స్లాట్‌ బుక్‌ అయిందని అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. అదేవిధంగా జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు



ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల పుస్తకాలు పరిశీలిస్తున్న కలెక్టర్‌

యూనిఫాం ఇవ్వకపోవడంపై ఎంఈఓ ధారాసింగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మార్సీని సందర్శించి ఎమ్మార్సీలో పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం ఉండడంతో విద్యార్థులకు అందించాల్సిన వాటిని ఎమ్మార్సీలో ఎందుకు ఉంచారని ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలు, గర్భిణుల హాజరు శాతాన్ని పరిశీలించారు. దుబ్బతండా, కోటినయక్‌ తండాల్లో ఉపాధి కూలీలతో కాసేపు ముచ్చటించారు. ఆయన వెంట ఎంపీడీఓ హసీం, తహసీల్దార్‌ వినోద్‌ కుమార్‌, మండల విద్యాధికారి ధారాసింగ్‌, ఎంపీఓ సంజీవ, ఏపీఓ ఈశ్వర్‌, ఏపీఎం మంజుల సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని వినతి

భానుపురి (సూర్యాపేట): 1969 ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు కోరారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ ప్లానింగ్‌ బోర్డు వైస్‌ చైర్మన్‌ జి.చిన్నారెడ్డిని ప్రజాభవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. పింఛన్‌ సౌకర్యం, ఉచిత వైద్య, రవాణా సదుపాయం కల్పించాలని పేర్కొన్నారు. ఉద్యమకారులను గుర్తించడానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. నాటి ఉద్యమంలో జైలు జీవితం గడిపిన వారికి ప్రస్తుతం ఎఫ్‌ఐఆర్‌ కాపీలు దొరికే పరిస్థితి లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని పేర్కొన్నారు. ఈమేరకు సమస్యల పరిష్కారానికి చిన్నారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, కె.సీతారాంరెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ, కోశాధికారి నరేంద్రుని విద్యాసాగర్‌, సభ్యులు కొత్తూరు వెంకటేశ్వర్లు, ముత్తినేని వెంకటేశ్వర్లు, చిత్రం భద్రమ్మ, బంధు రుద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్‌ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక



విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

సూర్యాపేటటౌన్‌: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్‌ స్కూల్‌లో నాలుగవ తరగతిలో ప్రవేశానికి శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల మైదానంలో విద్యార్థులకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లాలోని ఆయా గ్రామాల నుంచి 57 మంది బాలురు, 45 మంది బాలికలు హాజరయ్యారు. ఈ ఎంపికలో బాలబాలికలకు తొమ్మిది మోటార్‌ క్వాలిటీ టెస్టులు నిర్వహించారు. అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది బాలురు, 20 మంది బాలికలను ఎంపిక చేసినట్లు జిల్లా క్రీడల అధికారి జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన వారిని జూలై 9 నుంచి 10వ తేదీల్లో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్‌ సెక్రటరీ అజమ్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు మల్లేష్‌, గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనారసింహుడి నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్యహోమం, మూలవిరాట్‌ స్వామికి పంచామృతాభిషేకం జరిపించారు. శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలంకరణతో అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. మంత్ర పుష్పాలతో మహానివేదనగావించి భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్‌, ఈఓ నవీన్‌కుమార్‌ పాల్గొన్నారు.

మహిళలకు సమానత్వం కల్పించాలి

- ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు జ్యోతి



మాట్లాడుతున్న ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు జ్యోతి

భానుపురి (సూర్యాపేట): మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సమానత్వం కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కేంద్ర కమిటీ సభ్యురాలు జ్యోతి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఐద్వా జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మద్యం, డ్రగ్స్‌ను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. పదేళ్ల కాలంలో మహిళలపై దేశవ్యాప్తంగా హత్యలు, అత్యాచారాలు పెరిగాయని, అనేక చట్టాలు వస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరిగా అమలు చేయడం లేదని ఆరోపించారు. లింగ సమానత్వ సూచిలో మన దేశం 127వ స్థానంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు పని ప్రదేశంలో భద్రత కల్పించాలన్నారు. నిత్యావసర ధరలు తగ్గించాలని, ఇందుకోసం మహిళలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. ప్రజలకు అవసరమైన విద్యవైద్య ఉచితంగా అందించేందుకు కావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. సమభావన సంఘాల మహిళలకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్‌ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మేకనబోయిన సైదమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యురాలు మద్దెల జ్యోతి, జిల్లా నాయకురాలు జూలకంటి విజయలక్ష్మి, అండం నారాయణమ్మ, గోలి భాగ్యమ్మ, సురభి లక్ష్మి, దేవిరెడ్డి జ్యోతి, సృజన, నెమ్మాది లక్ష్మి, మణెమ్మ, పద్మ పాల్గొన్నారు.

రెగ్యులర్‌ ఉద్యోగులకే..

- మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూలు బాధ్యత అప్పగింత
- కొత్త నిబంధనలు తెచ్చిన ప్రభుత్వం
- అవుట్‌ సోర్సింగ్‌ సిబ్బందిని తప్పిస్తూ ఉత్తర్వులు జారీ



హుజూర్‌నగర్‌లోని బ్లాక్‌ -1 పరిధి చైతన్య కాలనీలో పన్ను వసూలు చేస్తున్న రెగ్యులర్‌ సిబ్బంది

హుజూర్‌నగర్‌: మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూళ్ల బాధ్యత రెగ్యులర్‌ ఉద్యోగులకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పౌరసేవా కేంద్రాల్లో నేరుగా ఆస్తిపన్ను స్వీకరించి కంప్యూటరైజ్డ్‌ రశీదు ఇచ్చే విధానానికి కూడా స్వస్తి పలకాలని సూచించింది. తాజాగా నూతన నిబంధనలు రూపొందించి అన్ని మున్సిపాలిటీల్లో అమలు చేయాలని ఆ శాఖ ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఈ నెల నుంచి కొత్త విధానంలో అమల్లోకి వచ్చింది. మున్సిపాలిటీల్లో ఏటా కోట్ల రూపాయల ఆస్తి పన్ను నగదు రూపంలో వసూలు చేయాల్సి ఉంటుంది. అయితే చాలా మున్సిపాలిటీల్లో రెగ్యులర్‌ ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో పొరుగు సేవల (అవుట్‌ సోర్సింగ్‌) సిబ్బందితో పన్ను వసూలు చేస్తున్నారు. దీంతో అక్కడక్కడా సిబ్బంది చేతివాటం ప్రదర్శించిన సంఘటనలు వెలుగు చూడడంతో ప్రభుత్వం ఆస్తిపన్ను వసూళ్లలో నిబంధనలు మార్చింది. దీంతో రెగ్యులర్‌ ఉద్యోగులే ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారు.

ఈ ఏడాది ఆస్తిపన్ను వసూలు లక్ష్యం (రూ. కోట్లలో..)

మున్సిపాలిటీ	నివాసగృహాలు	టార్గెట్‌
సూర్యాపేట	32,908	15.71
కోదాడ	16,535	6.92
హుజూర్‌నగర్‌	8,301	1.25
నేరేడుచర్ల	3,684	1.14
తిరుమలగిరి	5,447	1.34

చట్టపరమైన చర్యలకు అవకాశం లేక..

మున్సిపాలిటీల్లో ఏటా ఆస్తిపన్ను పొరుగు సేవల సిబ్బంది చేతియంత్రాలు (హ్యాండ్‌ హెల్డ్‌ మెషిన్స్‌లో) పీటీఐఎన్‌ (ప్రాపర్టీ ట్యాక్స్‌ ఐడెంటిఫికేషన్‌ నంబర్‌) నమోదు చేసి ఎంత పన్ను ఉందో చెప్పి సొమ్ము వసూలు చేసి రశీదు అందజేసేవారు. సేకరించిన సొమ్మును మున్సిపాలిటీల్లోని షరాఫ్‌ (అకౌంటెంట్‌)లో జమచేసేవారు. ఈ విధంగానే చాలాచోట్ల అవుట్‌ సోర్సింగ్‌ సిబ్బంది పనిచేస్తున్నారు. వాస్తవానికి చేతి యంత్రాలు రెగ్యులర్‌ ఉద్యోగుల పేరిట ఉన్నా కొరత కారణంగా పొరుగు సేవల సిబ్బంది ఆస్తిపన్ను వసూళ్ల విధులు నిర్వహిస్తున్నారు. వీరు ఆస్తిపన్ను వసూళ్లలో అవకతవకలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం లేదు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

వార్డు ఆఫీసర్లకు బాధ్యతలు

మున్సిపాలిటీల్లోఉద్యోగుల కొరత ఉన్నప్పటికీ ఇటీవల వీఆర్వోలను సర్దుబాటు చేసి వార్డు ఆఫీసర్లుగా విధులు అప్పగించారు. వీరందరికీ ఇప్పుడు ఆస్తి పన్ను వసూళ్ల బాధ్యతలు అప్పగించారు. అయితే ఇప్పటి వరకు ఆస్తిపన్ను వసూలు బాధ్యతలు నిర్వర్తించిన పొరుగు సేవల సిబ్బందిని రెగ్యులర్‌ ఉద్యోగులకు సహాయకులుగా నియమించారు.

రెగ్యులర్‌ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించాం



ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను వసూలు కోసం రెగ్యులర్‌ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించాం. ఇన్నాళ్లూ పొరుగు సేవల సిబ్బంది ఆస్తిపన్ను వసూలు పనులు చేసేవారు. వీరంతా ఇకనుంచి రెగ్యులర్‌ ఉద్యోగులకు సహాయకులుగా పనిచేస్తారు.

– కె. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌, హుజూర్‌నగర్‌

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


శ్రీనివాసచారి

గుర్రంపోడు : చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం గుర్రంపోడు మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ బి.శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలం నేరళ్లపల్లి గ్రామానికి చెందిన బొడ్డోజు శ్రీనివాసచారి (40) గుర్రంపోడు మండల కేంద్రంలో స్థిరపడ్డాడు. ఈ నెల 24న తన కుమారుడిని మోడల్ స్కూల్ నుంచి ఇంటికి తీసుకుని వస్తుండగా.. ఎదురుగా వస్తున్న బైక్ శ్రీనివాసచారిని బలంగా ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. శ్రీనివాసచారి మామ నారోజు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని కేశ్యతండా, మేగ్యతండాలలో శుక్రవారం దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 600 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ మల్లేష్, వై.వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణ, శేఖర్‌రెడ్డి, నాగరాజు, అనిల్, మహేశ్ పాల్గొన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

వలిగొండ : మండలంలోని రెడ్లరేపాక గ్రామానికి చెందిన మార్క బాలనరసింహ వృత్తిరీత్యా గీతకార్మికుడు. బాలనరసింహ రోజు మాదిరిగా కల్లు తీయడానికి శుక్రవారం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన చుట్టుపక్కలవారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే బాలనరసింహను చికిత్స నిమిత్తం భువనగిరి ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఉన్నతంగా మహిళా డిగ్రీ కళాశాల

- 1972లో తొమ్మిది మందితో నల్లగొండ పట్టణంలో ప్రారంభం
- నేడు మూడు వేల మంది విద్యార్థినులు
- స్వయం ప్రతిపత్తి కలిగిన కళాశాల
- దోస్త్ ద్వారా అడ్మిషన్లు


నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కంప్యూటర్ నేర్చుకుంటున్న విద్యార్థినులు

నల్లగొండ రూరల్: నల్లగొండ పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల సరస్వతీ నిలయంగా మారింది. ఉమ్మడి జిల్లాలో ఏకైక మహిళా డిగ్రీ కాలేజీ కావడంతోపాటు అత్యుత్తమ బోధన అందిస్తుండడంతో ఈ కళాశాలలో చేరేందుకు ఉమ్మడి జిల్లాల విద్యార్థినులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ కళాశాలలో 8 కోర్సుల ద్వారా విద్యార్థినులకు విద్యను అందిస్తున్నారు. సబ్జెక్టుల్లో చాయిస్ బేస్డ్ పద్ధతిలతో బోధన జరుగుతోంది. స్వయం ప్రతిపత్తి కలిగిన మహిళా డిగ్రీ కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలతో రెండు షిఫ్టులుగా విద్యా బోధన జరుగుతోంది. దోస్త్ ద్వారా 2015–16 నుంచి ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

గత ఏడాది కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్

నల్లగొండ పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలకు గత ఏడాది న్యాక్ 'ఏ'గ్రేడ్ ప్రకటించింది. 1972లో కేవలం 9 మంది విద్యార్థినులతో ప్రారంభమై నేడు మూడు వేల మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. కళాశాలలో అధునాతన భవనాలు, విశాలమైన తరగతి గదులు, క్రీడా మైదానం, సెమినార్ హాల్, ప్రయోగ శాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, తాగునీటి వసతి, గ్రంథాలయం ఉన్నాయి. పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు, మ్యాగజైన్లు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయి.

ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో..

మహిళా డిగ్రీ కళాశాల నల్లగొండ పట్టణం నడిబొడ్డున ఉండడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండాపోయాయి. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు తమ పిల్లలకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో ఈ కళాశాలలో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. కోదాడ, సూర్యాపేట, భువనగిరి నుంచి విద్యార్థినులు వచ్చి ఈ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. కొందరు విద్యార్థినులు హాస్టల్‌లో, బంధువుల ఇళ్లల్లో, బస్సుల్లో వచ్చి కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఈ కళాశాలలో మహిళలకు డిగ్రీలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ బ్రాంచ్ కూడా ఉంది.

మహిళా కళాశాలలో అందించే కోర్సులివే..

కోర్సు	మీడియం
బీఏ	ఉర్దూ
బీఏ	ఇంగ్లిష్
బీఏ	తెలుగు
బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్	ఇంగ్లిష్
బీఎస్సీ లైఫ్‌సైన్స్	ఇంగ్లిష్
బీఎస్సీ ఫిజికల్ సైన్స్	ఇంగ్లిష్
కంప్యూటర్ సైన్స్ హానర్స్	ఇంగ్లిష్

వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థినులు

ఈ కళాశాలలో చదివిన విద్యార్థినులు గత ఏడాది పీజీ ఎంట్రెన్స్ టెస్టులో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణించేందుకు విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థినులు ఎంతోమంది ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించిన పోటీ పరీక్షలో కళాశాలకు చెందిన బొజ్జ భవానికి ఇటీవల ఉద్యోగం రాగా.. జిల్లా కోర్టులో స్టెనోగ్రాఫర్‌గా మరో విద్యార్థిని చందన ఎంపికైంది. అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడాపోటీలు, జాతీయ స్థాయి క్రీడల్లో ఈ కళాశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ చూపుతున్నారు. కళాశాలకు చెందిన విద్యార్థిని ఎం.సరయు తైక్వాండో పోటీలో జాతీయ స్థాయిలో రిఫరీగా ఎంపికైంది. గత ఏడాది నలుగురు విద్యార్థినులు అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించారు.

విద్యార్థినుల భవిష్యత్‌కు జాబ్ మేళా



విద్యార్థినుల భవిష్యత్ కోసం డిగ్రీ ఫైనలియర్‌లో జాబ్‌మేళా నిర్వహించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నాం. విద్యార్థినుల్లో పోటీతత్వం పెంచేందుకు క్రీడల్లో ప్రోత్సహించడంతోపాటు ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఏర్పాటు చేశాం. జాతీయ సెమినార్లు నిర్వహించి విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తున్నాం.

– ఘనశ్యాం, ప్రిన్సిపాల్

పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం



విద్యార్థినులు అన్ని పోటీ పరీక్షల్లో రాణించేవిధంగా గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు, జర్నల్స్ అందుబాటులో ఉంచాం. ఇంటర్నెట్ సౌకర్యంతో గ్రంథాలయం విద్యార్థినులకు అందుబాటులో ఉంది. విద్యార్థినులు పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేలా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం.

– ఎస్. రాజారామ్, గ్రంథపాలకుడు

మమ్మల్ని విడిచి వెళ్లొద్దు మాస్టారూ..

- సోమాజీపల్లి, పోలుమల్ల గ్రామాల ఉపాధ్యాయుల బదిలీ
- వెళ్లొద్దని కాళ్లు పట్టుకుని బోరున ఏడ్చిన విద్యార్థులు


పోలుమల్లలో ఉపాధ్యాయుడి వద్ద కూర్చుని ఏడుస్తున్న విద్యార్థులు

మద్దిరాల : విద్యార్థి జీవితంలో గురువుకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ప్రతి ఒక విద్యార్థి ఎదుగుదలలో గురువుల పాత్ర ఎనలేనిది. విద్యార్థులతో అలాంటి బంధం పెనవేసుకున్న గురువు దూరమైతే ఆ బాధ వర్ణణాతీతం. మద్దిరాల మండల పరిధిలోని పోలుమల్ల గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14 సంవత్సరాలుగా తెలుగు పండిట్‌గా మెంతబోయిన సైదులు పనిచేస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. విద్యార్థులందరితో ఎంతో ప్రేమగా మెలిగేవారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన పోలుమల్ల పాఠశాల నుంచి నూతనకల్ మండల పరిధిలోని ఎర్రపహాడ్ ప్రభుత్వ పాఠశాలకు బదిలీ అయ్యారు. శుక్రవారం పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడిని విద్యార్థులు మీరు మమ్మల్ని విడిచి వెళ్లొద్దు సార్ అంటూ ఏడ్చుకుంటూ ఉపాధ్యాయుడి కాళ్లు పట్టుకుని వేడుకున్నారు. దీంతో ఆ విద్యార్థులు చూపించిన ప్రేమకు ఉపాధ్యాయుడు సైతం కన్నీరు పెట్టుకున్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయుడికి మధ్య ఉన్న అనుబంధం గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులను కట్టిపడేసింది. చూసేవారిని కంటతడిపెట్టేలా చేసింది.

సోమాజీపల్లి గ్రామంలో..

బొమ్మలరామారం : మండలంలోని సోమాజీపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ప్రదీప్ కన్నా పదోన్నతిపై రాజపేట మండలం బేగంపేట జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. గురువారం ఆయన పాఠశాల నుంచి రిలీవ్ అయ్యారు. దీంతో విద్యార్థులు ప్రదీప్ కన్నా చుట్టూ చేరి మన స్కూల్ నుంచి మీరు పోవద్దంటూ కంటతడి పెడుతు కాళ్లు పట్టుకుని ప్రాధేయపడ్డారు. సార్ మమ్మల్ని విడిచిపెట్టి వెళ్లొద్దంటూ బోరున విలపించారు. వారి రోదనలతో ఉపాధ్యాయుడు ప్రదీప్ కన్నా సైతం భావోద్వేగానికి గురై కంటతడి పెట్టాడు. 12 సంవత్సరాల క్రితం మారుమూల ప్రాంతమైన సోమాజీపల్లి తండా ప్రాథమిక పాఠశాలలో రోడ్డు సౌకర్యం సైతం సరిగా లేని రోజుల్లో ప్రదీప్ కన్నా విధుల్లో చేరారు. పాఠశాలలో విద్యార్థుల చేరికలను పెంచుతూ దాతల సహకారంతో విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠశాలకు మౌలిక వసతులు కల్పిస్తూ పాఠశాలను సమర్థంగా నిర్వహించారు. పాఠశాలతోపాటు గ్రామస్తులతో 12 ఏళ్ల అనుబంధాన్ని పెంచుకోవడంతో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సైతం బరువెక్కిన హృదయంతో ప్రదీప్ కన్నాకు వీడ్కోలు పలికారు.

విద్యార్థుల ప్రేమ మరువలేనిది



విద్యార్థులు నాపై చూపిన ప్రేమ ఎప్పటికీ మరిచిపోలేను. వాళ్లు ఏడుస్తుంటే నాకు కూడా కన్నీళ్లు ఆగలేదు. ఉద్యోగంలో బదిలీలు సహజం. నేను ఎక్కడ ఉన్నా విద్యార్థుల మంచిని కోరుకుంటా. వారికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తా.

– మెంతబోయిన సైదులు, ఉపాధ్యాయుడు


ఉపాధ్యాయుడు ప్రదీప్ కన్నాను పట్టుకుని రోదిస్తున్న విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో సెంట్రింగ్ మేస్త్రి మృతి


యూసుఫ్ (ఫైల్)

నేరేడుచర్ల : రోడ్డు ప్రమాదంలో ఓ సెంట్రింగ్ మేస్త్రి మృతి చెందిన సంఘటన శుక్రవారం నేరేడుచర్ల మండలంలోని చిల్లేపల్లి వద్ద చోటుచేసుకుంది. నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండల కేంద్రంలోని రాజీవ్ నగర్‌కు చెందిన సెంట్రింగ్ మేస్త్రి ఎస్‌కె.యూసుఫ్ (55) సెంట్రింగ్ పనుల నిమిత్తం కోదాడ– జడ్చర్ల ప్రధాన జాతీయ రహదారిపై మిర్యాలగూడకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో చిల్లేపల్లి చెరువు సమీపంలోకి రాగానే.. కడప నుంచి జగ్గయ్యపేట వైపు కెమికల్ లోడ్‌తో వెళ్తున్న డీసీఎం డ్రైవర్ బాషబోయిన సిద్దరామయ్య ఎదురుగా వస్తున్న యూసుఫ్ ద్విచక్రవాహనాన్ని అతివేగంగా ఢీకొట్టాడు. దీంతో యూసుఫ్ బైక్‌పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఏడాది క్రితం మృతి చెందగా.. మృతుడికి వివాహం అయినా ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపారు.

ఇద్దరు యువకుల రిమాండ్

చిట్యాల: మంచినీరు కావాలని ఓ ఇంటికి వెళ్లి, ఆ ఇంట్లోని వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు లాక్కెళ్లిన ఇద్దరు యువకులను శుక్రవారం పోలీసులు రిమాండ్ చేశారు. చిట్యాల ఎస్ఐ డి.సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 24వ తేదీన చిట్యాల మండలం పిశాటిగూడెం గ్రామానికి చెందిన పిశాటి సుగుణమ్మ ఇంటి వద్దకు నలుగురు యువకులు రెండు బైక్‌లపై వచ్చారు. తాగేందుకు మంచినీరు కావాలని ఆమెను అడిగారు. అనంతరం ఇద్దరు యువకులు ఆమె వెంట ఇంటిలోపలికి వెళ్లి ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కుని బైక్‌లపై పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చిట్యాల పోలీసులు కేసు నమోదు చేశారు. పుస్తెల తాడు దొంగిలించిన చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన సంపంగి కల్యాణ్, మరో బాలుడిని ఎస్ఐ సైదాబాబు ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో పట్టుకుని రిమాండ్ చేశారు. కాగా అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. దొంగిలించిన పుస్తెలతాడును రికవరీ చేసి బాధితురాలికి అందజేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు యువకులను త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

గరిడేపల్లి : మహిళ మెడలోనుంచి బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి లాక్కెళ్లిన సంఘటన గరిడేపల్లి మండల పరిధిలోని అబ్బిరెడ్డిగూడెం ఆవాసం సుభాష్‌నగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన గాదే నరసమ్మ తన పెసర చేను వద్దకు వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కొంత దూరంలో బైక్ ఆపాడు. మహిళ వద్దకు వెళ్లి క్రషర్ మిల్లుకు ఎలా వెళ్లాలని అడిగి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు తాడును లాక్కుని బైక్‌పై అక్కడి నుంచి పారిపోయాడు. గాదే నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పంప్ హౌస్‌లో చెట్లు నరికివేత


ట్రాక్టర్‌లోకి ఎక్కించేందుకు సిద్ధంగా ఉంచిన చెట్ల మొద్దులు

చింతపల్లి : మండల పరిధిలోని నసర్లపల్లిలో గల హైదరాబాద్ మెట్రో వాటర్ ప్లాంట్‌లో ఐదు రోజుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా భారీ వృక్షాలను నరికివేయడం చర్చనీయాంశంగా మారింది. వాటర్ ప్లాంట్ వెనుక భాగంలో గుట్టుచప్పుడు కాకుండా గోడపైకి స్టాండ్ల సహాయంతో ఎక్కి పంప్‌హౌస్‌లో ఉన్న భారీ వృక్షాలను కూలీల సహాయంతో నరికివేసి ట్రాక్టర్లు, లారీల ద్వారా భారీస్థాయిలో రవాణా చేస్తున్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే లక్షల రూపాయల విలువైన చెట్లను నరికి అమ్మకానికి తరలించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంప్‌హౌస్‌లో చెట్ల నరికివేతకు ఫారెస్ట్ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా అధికారుల అండదండలతో బయటి వ్యక్తులు ఈ అక్రమ కలప రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం.

అబార్షన్ ఘటనలో ఏడుగురిపై కేసు

సూర్యాపేట టౌన్ : పుట్టబోయేది ఆడపిల్ల అని స్కానింగ్‌లో తెలుసుకుని భార్యకు అబార్షన్ చేయించి ఆమె మృతికి కారణమైన కేసులో భర్తతో పాటు మరో ఆరుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండల పరిధిలోని ఎంజీనగర్ తండాకు చెందిన హరిసింగ్‌తో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని రాముతండాకు చెందిన భట్టు కృష్ణ కుమార్తె సుహాసినికి 2019లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు. కుమారుడి కోసం మూడో కాన్పు ఉంచుకున్నారు. అయితే ఏడు నెలల గర్భవతి అయిన సుహాసినికి స్కానింగ్ చేయించగా ఆడపిల్ల అని తేలడంతో ఆమెకు ఎలాగైనా అబార్షన్ చేయించాలని హరిసింగ్ నిర్ణయించుకున్నాడు. హుజూర్‌నగర్‌లోని కమల ఆస్పత్రిలో సుహాసినికి అబార్షన్ చేయించాడు. అయితే ఆపరేషన్ వికటించి ఆమె పరిస్థితి విషమించడంతో కోదాడ, ఖమ్మం, సూర్యాపేటలోని పలు ఆస్పత్రులకు తీసుకెళ్లగా ఆమె అప్పటికే మృతి చెందిందని వైద్యులు చెప్పారు. తమ కుమార్తె మృతికి కారణమైన హరిసింగ్‌తోపాటు కుటుంబ సభ్యులు, ఆస్పత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సూర్యాపేట పట్టణ పోలీసు స్టేషన్‌లో సుహాసిని తండ్రి భట్టు కృష్ణ ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్టు సీఐ రాజశేఖర్ తెలిపారు. ఈ కేసులో భర్త హరిసింగ్‌తోపాటు మృతురాలి అత్త, ఇద్దరు ఆడపడుచులు, కమల ఆస్పత్రి యాజమాన్యమైన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఈ కేసును చివ్వెంల స్టేషన్‌కు బదిలీ చేసినట్టు సీఐ తెలిపారు.

రాచకాల్వ గేటు అపహరణ

భువనగిరి క్రైం : చిన్నేరు వాగుపై బొల్లెపల్లి పెద్దచెరువు కాలువ కత్వకు గల గేటును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు సిరివేణికుంట మాజీ సర్పంచ్ పడాల అనిత వెంకటేశ్ తెలిపారు. అధికారులు విచారణ జరిపి దుండగులను పట్టుకోవాలని, గేటుకు మరమ్మతులు చేయాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కనుకుంట్ల బాబురావు, బొర్ర ప్రభాకర్, రైతులు బొర్ర గోపాల్, సిద్దగోని కష్ణమూర్తి, యంజాల యాదగిరి, బొర్ర నరేష్ ఉన్నారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు

నూతనకల్ : కోతులు దాడి చేసి మహిళను గాయపర్చిన సంఘటన నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. చిల్పకుంట్ల గ్రామానికి చెందిన పోతుగంటి నాగమ్మ పని నిమిత్తం బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి కోతులు ఇంట్లో ఉన్నాయి. మహిళ రావడాన్ని గమనించిన కోతులు ఒక్కసారిగా ఆమెపై దాడి చేసి రెండు చేతులను తీవ్రంగా గాయపరిచాయి. కోతులు దాడిచేస్తున్న సమయంలో ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చేసరికి అవి వెళ్లిపోయాయి. గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

రఘునాథపాలెంలో..

మఠంపల్లి: మండలంలోని రఘునాథపాలెంలో కోతుల గుంపు దాడి చేయడంతో శుక్రవారం నాయుడు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వెంకటేశ్వర్లును స్థానికులు హుజూర్‌నగర్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యంకోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

మిర్యాలగూడ టౌన్ : పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం అవంతీపురం గ్రామ శివారులో గల డంపింగ్ యార్డు వద్ద కొంతమంది పేకాడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. అయితే పోలీసులు వస్తున్నారని తెలుసుకున్న నలుగురు వ్యక్తులు పరారీ కాగా మరో ఇద్దరు పోలీసులకు చిక్కారు. మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేశామని, ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు మోటారు సైకిళ్లు, రూ.43,940 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాదాద్రిలో పాతాళ భైరవి నాటక ప్రదర్శన


పాతాళ భైరవి నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ ఉత్తర మాడవీధిలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీవినాయక నాట్య మండలి (సురభి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటక ప్రదర్శన శుక్రవారం రెండోరోజుకు చేరింది. సాయంత్రం 7గంటల నుంచి రాత్రి 9గంటల వరకు పాతాళ భైరవి నాటకాన్ని కళాకారులు ప్రదర్శించారు. పాతాళ భైరవి, తోట రాముడు, ఇందుమతి, మాంత్రికుడు, యక్షిణి కన్య వంటి పాత్రల్లో కళాకారుల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కేంద్రీయ సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీతల దర్శకత్వంలో అత్యంత మనోరంజకంగా నాటకాన్ని ప్రదర్శించారు. పాతాళ భైరవిగా ఆర్ శ్రీదేవి, తోట రాముడిగా శుభకర్, ఇందుమతిగా శాంతి, మాంత్రికుడిగా ఎస్.ఎ.శివశంకర్, యక్షిణిగా లక్ష్మీ, రాజాగా దినకర్, సీను మహరాజ్‌గా వి.ఉపేందర్, చంపగా వినమ్రవైనవి, నలినిగా మంజుమోహిని, పూజారిగా ఎస్.సుబ్బారావులు నటించారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు


బాధిత కుటుంబసభ్యులను ఓదారుస్తున్న దైద రవీందర్

నకిరేకల్ : విద్యుదాఘాతంతో మృతిచెందిన నకిరేకల్ మండలం ఓగోడు గ్రామానికి చెందిన మామ అల్లుళ్లు మాద వీరేందర్, భూపతి జానయ్య మృతదేహాలకు శుక్రవారం అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. మాద వీరేందర్, భూపతి జానయ్య భార్యలు పావని, ఉపేంద్ర ఫిర్యాదు మేరకు పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. మృతదేహాలకు నకిరేకల్ ఏరియా ఆస్పత్రిలో డాక్టర్లు పోస్ట్‌మార్టం నిర్వహించి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. అనంతరం వారి స్వగ్రామం ఓగోడుకు తరలించారు. మృతదేహాలను చూసేందుకు ఓగోడు, పక్కనే ఉన్న నడిగూడెం, వల్లభాపురం, పాలెం గ్రామ ప్రజలు కూడా వచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. మాద వీరేందర్, భూపతి జానయ్య మృతదేహాలను కాంగ్రెస్ నేత దైద రవీందర్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఫార్మా కంపెనీలకు అనుమతి ఇచ్చేది లేదు

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఫార్మా కంపెనీలకు మునుగోడు నియోజకవర్గంలో అనుమతి ఇచ్చే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో కాలుష్య నియంత్రణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంలో కాలుష్యం వెదజల్లే రెడ్ కేటగిరి కంపెనీలకు ఎన్ని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. అదేవిధంగా కంపెనీల సీఎస్ఆర్ నిధులు ఎక్కడెక్కడ ఖర్చు చేశారని అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న మునుగోడు మండలంలోని కిష్టాపురం, గట్టుప్పల్ మండల కేంద్రంలోని ఫార్మా కంపెనీల పనులను వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం కాపాడడమే తన ప్రధాన కర్తవ్యమని, అందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో కాలుష్యం వెదజల్లే కంపెనీల వివరాలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి మరో వారం రోజుల్లో నిర్వహించే సమీక్ష సమావేశానికి ప్రతి ఉద్యోగి హాజరుకావాలని సూచించారు.

వీఐపీ టికెట్లు రీసైక్లింగ్ చేస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో వీఐపీ రూ.150 టికెట్లను భక్తుల నుంచి సేకరించి, అదే టికెట్లను వేరే భక్తులకు విక్రయిస్తున్న వ్యక్తిపై యాదగిరిగుట్ట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు శుక్రవారం ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. వివరాలు.. యాదాద్రీశుడి దర్శనానికి హైదరాబాద్‌కు చెందిన సుధాకర్ గురువారం తన కుటుంబ సభ్యులతో కలిసి మినీ బస్సులో వచ్చారు. సుధాకర్‌తోపాటు కుటుంబ సభ్యులు రూ.150 టికెట్ తీసుకొని గోల్డెన్ క్యూలైన్‌లో వెళ్తున్న సమయంలో కొబ్బరికాయలు కొట్టే ప్రదేశంలో అర్ధభాగం కొబ్బరిచిప్పల సేకరణ కాంట్రాక్టర్ వద్ద పనిచేసే టంటం వెంకటేష్ భక్తుల వద్ద టికెట్లను తీసుకున్నాడు. ఈ విషయాన్ని మహా ద్వారం వద్ద విధుల్లో ఉన్న ఎస్పీఎఫ్ సిబ్బందికి భక్తుడు సుధాకర్ తెలియజేశాడు. వెంటనే ఎస్పీఎఫ్ సిబ్బంది గోల్డెన్ క్యూలైన్ వద్దకు వెళ్లి తనిఖీ చేయగా టంటం వెంకటేష్ వద్ద టికెట్లు ఉన్నట్లు గుర్తించారు. వెంకటేష్ భక్తుల వద్ద రూ.150 టికెట్లను తీసుకొని వేరే భక్తులకు విక్రయిస్తున్నట్లు ఎస్పీఎఫ్ పోలీసులు గుర్తించారు. వెంకటేష్.. భక్తుల నుంచి అక్రమంగా టిక్కెట్లు తీసుకుని, దేవస్థానానికి ఆర్థిక నష్టం కలిగించి, అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఈఓ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంకటేష్‌పై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యాదగిరిగుట్ట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఈఓ భాస్కర్‌రావు సూచనతో అధికారులు ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా అర్ధభాగం కొబ్బరిచిప్పల సేకరణ కాంట్రాక్టర్ బిట్టు కిశోర్ టెండర్‌ను రద్దు చేయాలని నోటీసులు సైతం జారీ చేసినట్లు ఈఓ పేర్కొన్నారు.

క్లుప్తంగా

బకాయి వేతనాలు చెల్లించాలి

అర్వపల్లి : ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేసే ఆరోగ్యమిత్రలకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని ఆరోగ్యమిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు ధరావత్ చత్రునాయక్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న 23 మంది ఆరోగ్యమిత్రలకు గత మూడు నెలల నుంచి వేతనాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం ఉన్నతాధికారులు స్పందించకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఈ సమావేశంలో ఆరోగ్యమిత్రలు పేరూరి రమణ, వేణు, మధుసూదన్, బద్రు, కృష్ణకుమార్, గఫార్, కిషోర్, సురేష్, వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు



ఢిల్లీలో ఎంపీని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

తుంగతుర్తి : ఢిల్లీలో జరిగిన మొట్టమొదటి పార్లమెంట్ సమావేశాలకు హాజరైన భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం మండలానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి చేడే మహేందర్, కాసర్ల గణేష్, కొరుకొప్పుల నరేష్, లింగన్న తదితరులు ఉన్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

అర్వపల్లి : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దాసరి వీరన్నముదిరాజ్ కోరారు. శుక్రవారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ –ఏ లోకి మార్చుతామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ఈ హామీని నెరవేర్చాలని విజ్ఞప్తిచేశారు. మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో మెపా జిల్లా నాయకులు మాదాసు నర్సింహ, మాదాసు రాములు, దొంతరబోయిన వెంకన్న, దాసరి అర్వపల్లి, సాయిని మనోహర్, దాసరి ఈశ్వర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల నివాళి



అర్వపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన యాదవ సంఘం సీనియర్ నాయకుడు పులిచర్ల నర్సయ్య అనారోగ్యంతో మరణించారు. దీంతో శుక్రవారం అతడి మృతదేహంపై జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కడారి నరేష్, బైరబోయిన పెద్దయ్య, మామిడాల రాజలింగం, పులిచర్ల ప్రభాకర్, కడారి యాగానందం, వట్టి వెంకన్న, దావుల గోపాల్, నోముల అర్వపల్లి, నోముల నరహరి తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెన్‌పహాడ్ : దోసపహాడ్ శివారులోని మూసీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మైనింగ్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్లకు ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

నరసింహ సుదర్శన యాగం

కోదాడరూరల్ : కూచిపూడిలోని భక్త రామాంజనేయ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో యాదగిరిగుట్ట ప్రధాన అర్చకుడు నల్లందీగల్ లక్ష్మీనర్సింహాచార్యుల ఆధ్వర్యంలో శుక్రవారం నరసింహ సుదర్శన యాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ, హనుమాన్ జీవిత చరిత్రతోపాటు స్థానికంగా వెలసిన నారసింహస్వామి మహిమలను భక్తులను వివరించారు. కూచిపూడిలో నూతనంగా నిర్మిస్తున్న భక్తరామాంజనేయస్వామి ఆలయం భవిష్యత్తులో దేదీప్యమానంగా విరాజిల్లుతుందని లక్ష్మీనర్సింహాచార్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు వంగిపురం పవన్‌కుమార్‌చార్యులు, నిర్వాహకులు కందికొండ సాయిబాబ, ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారిశేషు, భక్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



యాగంలో పాల్గొన్న భక్తులు

ప్రజలు భాగస్వాములు కావాలి



తుంగతుర్తి : తూర్పుగూడెంలో మహిళా శక్తి భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేల్, జెడ్పీచైర్‌పర్సన్ దీపిక



నాగారంలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి : గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని సూర్యాపేట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగంధర్‌రావు, శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. శుక్రవారం తూర్పుగూడెం గ్రామ పంచాయతీలో నూతన మహిళా సమైక్య భవనం, గ్రంథాలయ భవనం, పాఠశాల మరుగుదొడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో రాజకీయాలకతీతంగా ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, గుండగాని సుధాకర్, ఓరుగంటి సత్యనారాయణ, చింతకుంట్ల వెంకన్న, మురళి, పెండం రాంమూర్తి, మహేందర్‌గౌడ్, తొట్ల శ్రీనివాస్‌గౌడ్, దాయం ఝాన్సీరెడ్డి, నల్లు రామచంద్రారెడ్డి, రుద్ర రామచంద్రు పాల్గొన్నారు.

నాగారం : ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. శుక్రవారం నాగారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే సొంత నిధులు రూ.5లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తన సొంత నిధులు రూ.5లక్షలతో వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, నాయకులు కన్నెబోయిన వెంకటభిక్షం, జాజుల వీరయ్య, మంగదుడ్ల దశరథ, ఎల్మకంటి సోమన్న, పసుపులేటి వెంకట్‌రెడ్డి, పాశం యాదవరెడ్డి, పానుగంటి నర్సింహారెడ్డి, కొలిపాక సాయికుమార్, బయ్యం వెంకన్న, గద్దల సైదులు, కన్నెబోయిన లింగమల్లు, ఆలకుంట్ల బాలక్రిష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లికి చెందిన నాయకులను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సామేల్

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన మాజీ సర్పంచ్ బైరబోయిన సునీతరామలింగయ్య, ఎంపీటీసీ కనుకు పద్మశ్రీనివాస్ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి తిరుమలగిరిలోని క్యాంప్ కార్యాలయంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషిచేస్తామని వారు పేర్కొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్, ఎంపీపీ, ఎంపీటీసీలకు సన్మానం



తుంగతుర్తిలో జెడ్పీచైర్‌పర్సన్, ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పెన్‌పహాడ్ : ఎంపీపీ నెమ్మాది భిక్షం, ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు

తుంగతుర్తి : మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీటీసీల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో జెడ్పీచైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగేందర్‌రావు, ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, ఎంపీటీసీలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గుండగాని రాములు, చెరుకు సృజనపరమేష్, కవిత, మంగి, తునికి సాయిలు, తునికి లక్ష్మమ్మ, గోపగాని శ్రీను, తడకమళ్ల రవికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : జూలై 4న పదవి కాలం ముగుస్తున్నందున ఎంపీపీ నెమ్మాది భిక్షం, వైస్ ఎంపీపీ గార్లపాటి సింగారెడ్డిలతోపాటు పలువురు ఎంపీటీసీలకు మండల స్థాయి అధికారులు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీపీ నెమ్మాది భిక్షం మాట్లాడారు. తమ ఐదు సంవత్సరాల పదవి కాలం జూలై 4తో ముగుస్తున్నందున ఈ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదు సంవత్సరాలుగా తనతో పాటు పనిచేస్తూ మండలాభివృద్ధిలో భాగస్వాములైన తన తోటి ఎంపీటీసీలను ఆయన అభినందించారు. మున్ముందు కూడా ప్రజాసేవ కోసం తాము పనిచేస్తామని తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి సహకారంతో మండల అభివృద్ధి కోసం కృషి చేశామని అన్నారు. ఇంతకాలం తమకు సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్‌లు నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని భవనం కూల్చివేత

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని 16వ వార్డులో అమ్మ గార్డెన్ ఎదురుగా పడిదల శ్రవణ్‌కుమార్ అనే వ్యక్తి అనుమతి లేకుండా జీప్లస్1 భవనాన్ని నిర్మించినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఆ యజమానికి మే 18న, మే 23న, మే 29న నోటీసులు ఇచ్చామని చెప్పారు. మూడు సార్లు నోటీసులు ఇచ్చినా నిర్మాణంలో ఉన్న భవనానికి సదరు వ్యక్తి ఎలాంటి అనుమతి తీసుకోలేదని, దీంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం ఆధ్వర్యంలో శుక్రవారం భవనాన్ని కూల్చివేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా భవన నిర్మాణాలు చేపట్టొద్దని పట్టణ ప్రజలకు సూచించారు. అలా నిర్మిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని చెప్పారు.

గత ప్రభుత్వంలో జీఓ 26 దుర్వినియోగం



మాట్లాడుతున్న కక్కిరేణి శ్రీనివాస్

భానుపురి : గత ప్రభుత్వ హయాంలో జీఓ 26ను దుర్వినియోగం చేసి బిల్లులు పొందారని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జీఓ 26ను దుర్వినియోగం చేసి ప్రతి బిల్లును కలెక్టర్ ద్వారా ఆమోదింపజేశారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకు ఈ బిల్లులను వాడారని అన్నారు. ఐటీ హబ్‌కు బీటీ రోడ్డు పేరుతో రూ.41 లక్షలు డ్రాచేశారని, ప్రైవేటు వ్యక్తి భవనానికి బీటీ రోడ్డు ఎలా వేస్తారని ప్రశ్నించారు. కాలువల్లో షీల్డ్ తొలగించామని రూ.56లక్షల అవినీతికి పాల్పడారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీసీరోడ్లపై బీటీరోడ్డు, ప్యాచ్ వర్క్‌ల పేరుతో రూ.13 లక్షల బిల్లులు దోచుకున్నారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ల వార్డులకే ఎక్కువ నిధులు మంజూరు చేశారని, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఉన్నచోట అభివృద్ధి చేయలేదన్నారు. మున్సిపల్ చైర్మన్ అధికారులను ఇంటికి పిలిపించి కౌన్సిల్ ఎజెండా తయారు చేశారని, కనీసం ఫ్లోర్ లీడర్లతో చర్చించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బైరు శైలేందర్, రాపర్తి శ్రీనివాస్, అనంతుల యాదగిరి, బచ్చలకూరి శ్రీనివాస్, ధరావత్ రవికుమార్, నాయకులు శబరి, రాజేందర్, చంద్రునాయక్, ఆలేటి మాణిక్యం పాల్గొన్నారు.

అభివృద్ధి చేసినవారిపై అవినీతి ఆరోపణలు తగవు

సూర్యాపేటటౌన్ : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసిన వారిపై కాంగ్రెస్ నాయకులు అవినీతి మరకలు వేసే ప్రయత్నం చేస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, కౌన్సిలర్లు చింతలపాటి భరత్‌మహాజన్, తాహేర్‌పాషా అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సూర్యాపేట పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.80కోట్ల నిధులు పనులు ప్రారంభమైన తర్వాత వెనక్కి వెళ్లాయన్నారు. వెనక్కి వెళ్లిన నిధుల గురించి మాట్లాడమంటే వచ్చిన రూ.3కోట్ల 35లక్షల నిధుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. సూర్యాపేటలో జరిగిన అభివృద్ధిని చూసే ప్రజలు మూడో సారి మాజీ మంత్రి జగదీష్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించారని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి బూరబాల సైదులుగౌడ్, నాయకులు ఆకుల లవకుశ, బత్తుల జాని, సాగర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, జానకిరాం, బైరు వెంకన్న, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లిఖార్జున స్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

నాగారం : మండల పరిధిలోని పసునూర్‌లో భ్రమరాంబిక సమేత మల్లిఖార్జున స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రుద్రాభిషేకం, నవగ్రహ మండపారాధన, శాంతికల్యాణం, తీర్థప్రసాదాల వినియోగం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు శివశ్రీ కుందుర్తి కృష్ణప్రసాద్ గురుక్కల్, వినయ్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హెలెన్ కెల్లర్ జీవితం స్ఫూర్తిదాయకం



హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దివ్యాంగులు

సూర్యాపేట : హెలెన్ కెల్లర్ జీవితం వికలాంగుల సమాజానికి స్ఫూర్తి దాయకమని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు అర్వపల్లి లింగయ్య అన్నారు. శుక్రవారం హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హెలెన్ కెల్లర్ తన జీవితాంతం అంధులకు అండగా ఉన్నారని అన్నారు. అంధులను ఆదుకునేందుకు 34 దేశాలలో సేవ చేశారని తెలిపారు. హెలెన్ కెల్లర్‌కు చిన్న వయసులోనే రెండు కళ్లు పోయామని, అయినా నిరుత్సాహ పడకుండా ఉన్నత చదువులు చదువుకున్నారని అన్నారు. వికలాంగులు హెలెన్ కెల్లర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు శిరంశెట్టి రామారావు, ఉపాధ్యక్షుడు సంతోష్, జిల్లా కమిటీ సభ్యులు కప్పల సత్యం, నల్లమేకల రామ్‌కుమార్, ఎస్ వనిత, అరుణ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



తుంగతుర్తిలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

తుంగతుర్తి : మండల కేంద్రానికి చెందిన ఎండీ సయ్యద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మృతుడి కుమారుడు ఎండీ భాషా 10వ తరగతి స్నేహితులు శుక్రవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.18,500 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణదాసు నాగరాజు, పోడేటి సాయికృష్ణ, మున్నా లింగన్న, రోహిత్, మధు, సాయి, భరత్, సుధాకర్, తన్నీరు సాయి, మజ్జిలాల్, అశోక్, శాంతన్, భాస్కర్, అనిల్, క్రిష్ణ, రమేష్, ప్రవీణ్, రహీమ్, బౌరోజు శ్రీకాంత్ పాల్గొన్నారు.

పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

నూతనకల్ : ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టే పనుల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ మధుసూదన రాజు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఉపాధి హామీ పనుల 14వ సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధి పథకం ద్వారా నిర్వహించే ప్రతి పనిపై కూలీలకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వన నర్సరీల ద్వారా మొక్కల పెంపకంలో అలసత్వం వహించి మొక్కలు చనిపోవడానికి కారకులైన అధికారులకు జరిమానా విధించారు. నాటిన మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్‌లకు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. మట్టి తీత పనుల్లో కూలీల చెల్లింపులకు సామాజిక సభ్యులు చేపట్టిన కొలతలకు తేడా ఉండటంతో ఈసీతోపాటు టెక్నికల్ అసిస్టెంట్లకు కూడా జరిమానా విధించి రికవరీకి ఆదేశించారు. మండల పరిధిలోని 17గ్రామ పంచాయతీల్లో జరిగిన పనుల్లో అలసత్వం వహించిన వివిధ స్థాయిల అధికారులకు రూ.3,51,567తోపాటు, వివిధ స్థాయిల సిబ్బందికి రూ.85వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమమల్లారెడ్డి, విజిలెన్స్ అధికారి ఆశ, ఎస్ఆర్పీ శ్రీనివాసచారి, ఏపీఓ మామిడి శ్రీరాములు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీలో పాల్గొని మాట్లాడుతున్న డీఆర్‌డీఓ మధుసూదనరాజు

కార్మికుల నూతన ఒప్పందం అమలు చేయాలి

చివ్వెంల : సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల నూతన ఒప్పందాన్ని అమలు చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం చివ్వెంల మండల కేంద్రంలోని సివిల్ సప్లయ్ గోదాం వద్ద నిర్వహించిన హమాలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 జనవరి నుంచి నూతన ఒప్పందాన్ని అమలు చేయాల్సి ఉన్నా కాల యాపన చేయడం ఏంటని ప్రశ్నించారు. రేషన్ దుకాణాలకు, అంగన్‌వాడీలకు, హాస్టళ్లకు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు పంపించడంలో హమాలీలు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వారికి కనీస వేతనంతో పాటు, పీఎఫ్, ఈఎస్ఐ, పింఛన్ వంటి చట్టబద్ధ హక్కులతోపాటు పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మయ్య, యేసు, వెంకన్న, వినయ్, ఆదయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

నీట్ లీకేజీపై విద్యార్థి నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

ఆత్మకూర్(ఎస్) : నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడారు. ఎంబీబీఎస్, ఇతర వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఎంట్రెన్స్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు ప్రధాని నరేంద్రమోదీ బాధ్యత వహిస్తూ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. నీట్ పరీక్షలను రాష్ట్రాల పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, పరమేష్, సాయి, గణేష్, సంపత్, గోపి, మహేష్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుపై పునరాలోచించాలి

అర్వపల్లి : భూముల రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుపై ప్రభుత్వం పునరాలోచించాలని రియల్ ఎస్టేట్ వ్యాపారుల అసోసియేషన్ మండల నాయకుడు కమటం రాజు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలోనే రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచారని చెప్పారు. ప్రస్తుతం మళ్లీ ఈచార్జీలను పెంచితే సామాన్య ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. అలాగే రియల్ ఎస్టేట్ రంగం కుదేలవుతుందని అన్నారు. ఈ చార్జీల పెంపు మూలంగా పేద ప్రజలు ఇళ్లను నిర్మించుకోవడం భారంగా మారుతుందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రేషన్ చార్జీలనే కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఐదేళ్ల పాలనలో అనేక సమస్యలు పరిష్కారం



నాగారంలో మాట్లాడుతున్న ఎంపీపీ మణి



పెన్‌పహాడ్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ భిక్షం

నాగారం : ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో అనేక సమస్యలు పరిష్కరించామని ఎంపీపీ కూరం మణివెంకన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన చివరి విడత సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ ధార శ్రీనివాస్, ఎస్సారెస్పీ డీఈఈ పిచ్చయ్య, ఎంఈఓ బి.బాలునాయక్, విద్యుత్ ఏఈఈ మహేంద్రకుమార్, ఏఓ గణేష్, డాక్టర్ హర్షవర్ధన్, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : వర్షాకాలం దృష్ట్యా ముందస్తు జాగ్రత్తలతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడొచ్చని ఎంపీపీ నెమ్మాది భిక్షం అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక అధికారులు గ్రామాల్లో దోమల బెడద లేకుండా ఫాగింగ్ చేపట్టాలన్నారు. మండలంలోని గాజులమల్కాపురం, చెట్లముకుందాపురం గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాలకు విద్యుత్, మంచినీటి సౌకర్యాలు కల్పించకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం ఏఈ రమేష్ మాట్లాడారు. మండల కేంద్రంలో 220కేవీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులను త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మామిడి అనిత, మండల ప్రత్యేకాధికారి రాములు, వైస్ ఎంపీపీ గార్లపాటి సింగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంపీఓ నరేష్ పాల్గొన్నారు.

జూలై 1న విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

అర్వపల్లి : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో జూలై 1న విశాలాక్ష్మి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు గానూ నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశారు. వేడుకల్లో భాగంగా జూలై 1వ తేదీన ఆలయంలో ఉదయం అఖండ దీపారాధన, గణపతిపూజ, పుణ్యాహవాచనం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం జరుగనున్నాయి. అలాగే చివరగా బలిహరణ, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. ఈ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.



వేడుకలకు ముస్తాబైన విశ్వేశ్వరస్వామి ఆలయం

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

గరిడేపల్లి : ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా గరిడేపల్లి మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలో ఆయన పర్యటించి మాట్లాడారు. వన మహోత్సవంలో మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వీపీపీ ప్లాంటేషన్‌కి స్థలాలు ఎంపిక చేసుకోవాలన్నారు. అంటువ్యాధుల నివారణకు యాక్షన్‌ప్లాన్ రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ మౌలానా, పంచాయతీ కార్యదర్శి సుధీర్, ఏఎన్ఎం, హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

అర్వపల్లి : పశువులకు రైతులు ముందస్తుగా ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలను వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్ కోరారు. అర్వపల్లిలో శుక్రవారం పశువులకు ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతులు తెల్ల, నల్ల పశువులకు ఈ టీకాలను వేయించాలని సూచించారు. గ్రామంలోని రైతుల పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది యాకయ్య, రైతులు బైరు రాంబాబు, సురేష్, మనుబోతుల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణను అడ్డుకోవాలని వినతి

చిలుకూరు : చిలుకూరు మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ సీపీఐ నాయకులు శుక్రవారం గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జెర్రిపోతులగూడెంలో గతంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైతే సీపీఐ తరఫున పోరాడి కాపాడామని తెలిపారు. ప్రస్తుతం మళ్లీ ఆ భూమిని కబ్జా చేస్తున్నారని, ప్రభుత్వం భూమిని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకొని ఇళ్లు లేని నిరుపేదలకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఐ నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.